

చెదలు.. నివారిస్తేనే లాభాలు
ఉద్యాన పంటల సాగులో చెదల నివారణపై దృష్టిసారిస్తేనే మంచి లాభాలు సాధ్యమని హార్టికల్చర్ అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



అవస్థలు అధికం
వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఐకేపీ–వీఓఏల యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. 8లో▸



నిరుపయోగంగా..
గ్రామీణ యువత ఆటల్లో రాణించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు పలు చోట్ల నిరుపయోగంగా మారాయి. 9లో▸

అనంత అవకాశం.. పర్యాటక శూన్యం!

ప్రకృతి అందాలకు నెలవైన అనంతగిరి కొండలు దశాబ్దాలుగా పర్యాటక అభివృద్ధికి నోచుకోవడం లేదు. తెలంగాణ ఊటీగా పేరున్న ఈ ప్రాంతంపై దృష్టిసారిస్తే అద్భుతమైన పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు, పాలకులు ఆదిశగా అడుగులు వేయడం లేదు.

అభివృద్ధికి నోచుకోని అనంతగిరి కొండలు

- టూరిజం డెవలప్‌మెంట్‌పై ముందుకు పడని అడుగులు
- ఏళ్లు గడుస్తున్నా అదే దుస్థితి
- ప్రత్యేక నిధుల కేటాయింపుపై దృష్టి సారించని ప్రభుత్వం



అనంతగిరి కొండలపై విదేశీ పర్యాటకుల సందడి (ఫైల్)

వికారాబాద్ అర్బన్: పచ్చని ప్రకృతి.. చుట్టూ ఎత్తయిన కొండలు.. వీటి మధ్య ఆధ్యాత్మిక శోభను తలపించే అనంతగిరి ఆలయం.. దీనికి కొద్ది దూరంలోనే కోట్‌పల్లి ప్రాజెక్టు.. ఇలా పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్న ఈ ప్రాంతాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. 'అనంతగిరిని టూరిజం స్పాట్‌గా డెవలప్ చేస్తాం' అని నాయకులు చెబుతున్న మాటలు హామీలుగానే మిగిలిపోతున్నాయి.

టూరిస్టుల తాకిడి

జిల్లా కేంద్రానికి సమీపంలోని అనంతగిరి ఆలయానికి ఎప్పటి నుంచో పర్యాటక ప్రాముఖ్యత ఉంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంగా ఉండటంతో శని, ఆదివారాల్లో భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వేసవిలో కుటుంబ సమేతంగా వచ్చి కార్తీక వన భోజనాలు చేస్తుంటారు. ప్రస్తుతం సెలవులు కావడంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. అయితే ఇక్కడి వాతావరణం ఎంత రమణీయంగా ఉన్నప్పటికీ.. సరైన వసతులు, ఏర్పాట్లు లేకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురవుతున్నారు. కేవలం ప్రకృతి అందాలను వీక్షించి, వెంట తెచ్చుకున్న పలహారాలు, భోజనాలు తినేసి ఇళ్లకు వెళ్తున్నారు.

వనరులను వినియోగిస్తే..

అనంతగిరి పక్కనే ఉన్న కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులతో పాటు మరో పక్కనే ఉన్న బుగ్గ రామలింగేశ్వరాలయం ఆధ్యాత్మిక భావాలతో పాటు ఆహ్లాదాన్ని పంచుతాయి. అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్న తర్వాత భక్తులు కోట్‌పల్లి వెళ్లి ప్రాజెక్టు నీటిలో సరదాగా గడుపుతారు. అనంతగిరిలో ఏర్పాటు చేసిన హరిత రిసార్ట్ పర్యా టలకు విడిదినిస్తోంది. ప్రస్తుతం ఇక్కడే ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్మిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో జనాల తాకిడి మరింతగా పెరిగే అవకాశముంది. ఈ వనరులన్నింటినీ వినియోగించుకుని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే దిశగా ఆలోచించాలని ప్రజలుకోరుతున్నారు. సీఎం కేసీఆర్, కలెక్టర్, జిల్లా ఎమ్మెల్యేలు స్పందించి ప్రత్యేక నిధులు కేటాయిస్తే అనంతగిరి రాష్ట్రానికే తలమానికంగా మారుతుందని చెబుతున్నారు.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి..

అనంతగిరి మంచి పర్యాటక కేంద్రమని పసిగట్టిన ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. కొండల చుట్టూ రిసార్టులు ఏర్పాటు చేసి టూరిస్టులను ఆకర్షిస్తున్నారు. మరి కొంత మంది కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల ఒడ్డున అక్రమంగా రిసార్టులు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా బోటింగ్‌లు నిర్వహిస్తున్నారు. గుట్ట చుట్టూ వెలిసిన రిసార్టుల కారణంగా అనంతగిరికి సరైన గౌరవం దక్కడం లేదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి టూరిజం అభివృద్ధిపై దృష్టిసారిస్తే ఆదాయంతో పాటు స్థానికులు, యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంది.



అనంతగిరి గుట్టపై నిర్మించిన హరిత రిసార్ట్

హామీలకే పరిమితం

రాజకీయ నేతల్లో లోపించిన చిత్తశుద్ధి కారణంగా ఈ ప్రాంతం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. తెలంగాణ ఏర్పాటుకు ముందునుంచే ఎంతో మంది నాయకులు గుప్పించిన హామీలు ఇప్పటికీ నెరవేరడం లేదు. హరిత రిసార్టు ఏర్పాటుతో ఉమ్మడి ఏపీలోనే పర్యాటకానికి పునాది పడినా.. కేవలం రిసార్ట్ ప్రారంభంతోనే చేతులు దులుపుకొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ అనంతగిరి టూరిజం అభివృద్ధిపై పలు హామీలు ఇచ్చినా.. అడుగు ముందుకు పడలేదు. స్థానిక నేతల వైఫల్యంతోనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద టూరిస్టుల సందడి (ఫైల్)



కొండపై వెలసిన అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద భారీ ఆంజనేయస్వామి విగ్రహం

ప్రకృతి అందాల కనువిందు

పర్యాటక ప్రాంతాల్లో ఎకో, ఇండస్ట్రియల్ టూరిజం కాన్సెప్ట్‌లు ఎంతగానో ప్రాచుర్యం పొందుతున్నాయి. స్థానిక నాయకులు, అధికారులు ఈ దిశగా చర్యలేవీ తీసుకోవడం లేదు. దట్టమైన అడవులతో పాటు, మూసీ నది జన్మ స్థలం కావడంతో అనంతగిరికి గొప్ప పేరు ప్రఖ్యాతులున్నాయి. ఇక్కడ లభించే ఔషధ మొక్కలు ఆయుర్వేదంలో అనేక వ్యాధులను నయం చేస్తాయనేది అందరికీ తెలిసిందే. అనంతగిరి అడవుల్లోని స్వచ్ఛమైన గాలి ఎన్నో రుగ్మతలను దూరం చేస్తుంది. ఈ అడవిలోని వృక్షసంపద చూపరులకు కనువిందు చేస్తుంది. ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్న పక్షిజాతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జింకలు, కుందేళ్లు, నెమళ్లు పర్యాటకుల చూపులను కట్టిపడేస్తాయి.

న్యూస్‌రీల్

నవోదయ పరీక్షపై అవగాహన



పరీక్ష ప్రిపరేషన్ విధానాన్ని వివరిస్తున్న హెచ్‌ఎం క్రాంతికుమార్

కొడంగల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు మంచి స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు నమూనా పరీక్షకు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాత కొడంగల్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం క్రాంతి కుమార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్ష కోసం చదవాల్సిన విధానాన్ని వివరించారు. నవోదయలో సీటు సాధించాలంటే కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. పరీక్షకు సంబంధించిన సబ్జెక్టుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొడంగల్ తహసీల్దార్ బుచ్చయ్యకు గాయాలు



కొడంగల్ ఆస్పత్రిలో తహసీల్దార్

కొడంగల్: స్థానిక తహసీల్దార్ బుచ్చయ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రోజూ మాదిరిగానే తన స్వస్థలమైన చేవెళ్ల నుంచి కారులో కొడంగల్‌కు బయలుదేరారు. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం శివారు వద్ద ఎదురుగా, అతివేగంగా వచ్చిన లారీ ఆయన ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ఉన్న తహసీల్దార్‌కు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆయనను కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తహసీల్దార్‌కు గాయాలైన విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు కొడంగల్ ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ తదితరులు

వికారాబాద్ అర్బన్: పదేళ్ల క్రితం ఆధార్ కార్డు పొందిన వారు విధిగా అప్‌డేట్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆధార్ అప్‌డేట్ చేయడం ద్వారా జీవన సౌలభ్యాన్ని సులభతరం చేసుకోవచ్చని సూచించారు. దీంతో రేషన్ కార్డు మీద ఎక్కడైనా సరుకులు పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు సులువుగా ఉంటుందని, తప్పిపోయిన కుటుంబ సభ్యులను ఆధార్ సాయంతో తిరిగి వారి కుటుంబాలకు కలిపే విధంగా ఉపయోగపడుతుందని వివరించారు. బ్యాంక్ ఖాతాలు తెరవడం, మొబైల్ సిమ్ పొందడం వంటివి సులువుగా పూర్తవుతాయని చెప్పారు. అనంతరం ఆధార్ అప్‌డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆధార్ యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ సత్యకళ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, అడిషనల్ ఎస్పీ మురళీధర్‌రావు, డీఎంహెచ్‌ఓ పాల్వాన్ కుమార్, డీఈఓ రేణుకాదేవి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర అక్రమ రవాణాకు 'చెక్'



కొత్లాపూర్ చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: రాష్ట్ర సరిహద్దు కొత్లాపూర్ వద్ద పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేశామని ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మద్యం, ధాన్యం, బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

రుణాలు ఉత్తిమాటే!



పూడూరులో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

- నామ్‌కేవాస్తేగా కార్పొరేషన్లు
- దరఖాస్తు చేసుకున్నా అందని దైన్యం

పూడూరు: కార్పొరేషన్ల రుణాలు నిరుద్యోగ యువతకు అందని ద్రాక్షగా మారాయి. ప్రభుత్వం నిరుద్యోగ యువత వివిధ రంగాల్లో ఆర్థికంగా ఎదిగేందుకు ఇస్తున్న సబ్సిడీ రుణాలు అందక లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారు. కొన్ని చోట్ల ఇచ్చినా యూనిట్ కాస్ట్‌లో కనీసం సగం డబ్బులు కూడా ఇవ్వడం లేదు. బ్యాంకు బ్యాలెన్స్, రాజకీయ పరపతి ఉన్నవారికి లక్షల్లో సబ్సిడీ రుణాలను అందిస్తుండటం గమనార్హం. పేదలకు రుణం ఇవ్వడంతో నానా కొర్రీలు పెట్టి బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఉదహరణకు కిరాణా దుకాణం ప్రారంభించడానికి 1.50లక్షలు అవుతుంది. బ్యాంకు అధికారులు మాత్రం రూ.30వేల రుణం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. బ్యాంకులో రుణం కోసం సమర్పించే పత్రాలకు, స్టాంపింగ్‌కు కనీసం 5వేలు ఖర్చు అవుతుంది. లబ్ధిదారునికి చేతికి అందేది రూ.25వేలు మాత్రమే. దీంతో నిరుద్యోగ యువత అప్పుల్లో కూరుకుపోయి అటు ఆర్థికంగా, ఇటు మానసిక వేదనకు గురవుతున్నారు.

యూనిట్‌కాస్ట్‌కు అనుగుణంగా ఇవ్వాలి

కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలు లబ్ధిదారులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అందిస్తే ఆర్థికంగా ఎదుగుతారు. యూనిట్ కాస్ట్‌కు అనుగుణంగా రుణం అందిస్తే ఇబ్బందులు తలెత్తకపోవడంతో పాటు నెల నెలా బ్యాంకు రుణం తిరిగి చెల్లించే వీలుంటుంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం 1030 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఐదేళ్లు గడుస్తున్నా రుణాలు ఇవ్వలేదు. ఇటీవల మైనార్టీకార్పొరేషన్ ద్వారా రుణాల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 18 యూనిట్లకు గాను 24 లక్షలు మంజూరు అయ్యాయి. మండలంలో 32జీపీల నుంచి 377 మంది దరఖాస్తు చేసుకోగా..18 మందిని మాత్రమే లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కనీసం పది శాతం మందికి కూడా లబ్ధి చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలుకుబడి ఉన్నవారికే..



మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా. 377 మంది దరఖాస్తు చేసుకుంటే ఇచ్చింది 18 మందికే. ప్రభుత్వం పలుకుబడి ఉన్న వారే సబ్సిడీ రుణాలు పొందుతున్నారు. నామ్‌కే వాస్తేగా లబ్ధిదారుల ఎంపికను నిర్వహిస్తున్నారు.

– జబ్బార్‌ఖాన్, చన్గోముల్

పూర్తి స్థాయిలో ఇవ్వాలి



దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రుణాలు ఇవ్వాలి. రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని నోటిఫికేషన్ ఇస్తూ లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడం సరికాదు. నామమాత్రంగా రుణాలు ఇస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అర్హులైన వారందరికీ రుణాలను అందించి ఆర్థికంగా ఎదిగేలా చూడాలి.

– అంజద్, చన్గోముల్

అర్హులందరికీ రుణాలు



అర్హులైన ప్రతి ఒక్కరికి కార్పొరేషన్ రుణాలను అందిస్తున్నాం.సబ్సిడీ ఇవ్వడంలో దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. మండలానికి వచ్చిన నిధులు గ్రామాల వారీగా విభజించి అందరికి అందేలా చర్యలు తీసుకుంటున్నాం. నిధులు అధిక మొత్తంలో వస్తే యూనిట్ ధరకు తగ్గట్టుగా అందేవి. యూనిట్ ఏర్పాటుకు నిధులు సరిపోవడం లేదనే మాట వాస్తవమే.

– ఉమాదేవి, ఎంపీడీఓ

అర్హులందరికీ ఓటు కల్పించండి

- తొలగించిన వారి వివరాలను మరోసారి పరిశీలించాలి
- అనుమతులు లేకుండా ఇసుక తరలించొద్దు
- అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత తహసీల్దార్లదే
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి



వికారాబాద్ అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటరు లిస్ట్‌లో మార్పుచేర్పులు, డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ, ఇసుక రవాణా తదితర అంశాలపై గురువారం రెవెన్యూ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని, తొలగించిన వారి వివరాలను మరోసారి పరిశీలించాలని సూచించారు. ఒకే ఇంట్లో ఆరుగురు ఓటర్ల కన్నా ఎక్కువ మంది ఉంటే క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిర్ధారించుకోవాలని, అవసరమైతే బై నంబర్లు ఇచ్చి వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు పనులకు అవసరమైన ఇసుకను క్యూబిక్ మీటర్ రూ.600 చొప్పున అందిస్తున్నామని స్పష్టంచేశారు. అనుమతులు పొందిన వారు ట్రాక్టర్ల ద్వారా మాత్రమే తరలించాలని తెలిపారు. రాత్రి సమయాల్లో, సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితిలోనూ నదిలోకి వెళ్లకూడదని, నిబంధనలను అతిక్రమించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు. తహసీల్దార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు.

నష్టం వివరాలు సేకరించాలి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని, వీరికి ప్రభుత్వం తరఫున పరిహారం అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్లు కూలిన, పశువులు మృతిచెందిన వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. డబుల్ బెడ్ రూం ధ్రువీకరణను పూర్తి చేసి సంబంధిత జాబితా అందజేయాలని తెలిపారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్ కుమార్, ఇతర శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని జీపీల్లో సీసీ రోడ్లు నిర్మించండి

ప్రతీ గ్రామ పంచాయతీలో రెండు కిలోమీటర్లకు మించకుండా సీసీ రోడ్లు నిర్మించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై గురువారం ఏపీఓలు, టీఏలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న పనులపై సమీక్షించారు. సాగు నీటి కాల్వల్లో ప్రణాళికాబద్ధంగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో బండ్ల బాట, నక్షబాటలను గుర్తించి మే నెలాఖరులోపు రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలని, హరితహారం నిర్వహణకు మే 15లోపు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కృష్ణన్, ఉపాధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనితీరుతోనే తగిన గుర్తింపు

- 'హోంగార్డు దర్బార్'లో ఎస్పీ కోటిరెడ్డి
- ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంతో పనిచేయాలని పిలుపు



హాజరైన హోంగార్డులు

అనంతగిరి: హోంగార్డు నుంచి తన వరకు ప్రతిఒక్కరూ పోలీసు కుటుంబ సభ్యులేనని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన హోంగార్డు దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. హోంగార్డులకు ఎలాంటి సమస్యలున్నా పైఅధికారులకు తెలియజేయాలని, అక్కడ పరిష్కారం కాకపోతే నేరుగా వచ్చి తనను కలవాలని సూచించారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండే వారికి ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటామని తెలిపారు. చేసే ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా మన పనితీరుతోనే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పనిచేసే చోట నైపుణ్యాన్ని, ప్రతిభను చూపి మన్ననలు పొందాలని తెలిపారు. కష్టపడి పని చేసేవారికి అధికారులు, ప్రజలు అండగా ఉంటారన్నారు. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వహించాలని ప్రతి ఒక్కరు పోలీసు శాఖకు మంచి పేరు తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, ఏఓ వందన, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు సూరపు నాయుడు, రత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



వాహనదారులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరూ పోలీస్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రయాణికులకు, వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుచట్టాలు అతిక్రమించడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగంగా వెళ్లకుండా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పరిగి సీఐ వెంకట్రామయ్య, కొడంగల్ సీఐ శంకర్, ఎస్‌ఐలు గిరి, విశ్వజన్, విఠల్ రెడ్డి, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో చెక్‌పోస్టు



రావులపల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

కొడంగల్ రూరల్ : కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం మండల పరిధిలోని రావులపల్లిలో రహదారిపై గురువారం ఎస్‌ఐ రవిగౌడ్ చెక్‌పోస్ట్‌ను ప్రారంభించారు. ఒక హెడ్ కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తారు. వాహనాల తనిఖీతోపాటు అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ధారూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. మండల పరిధిలోని నాగారం సమీప ఉన్నత పాఠశాల వద్ద ఎస్‌ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే అంపల్లి చౌరస్తా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశువులకు గడ్డి వేసేందుకు వెళుతూ..

గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలుడి మృతి

కొత్తూరు: పొలం వద్ద పశువులకు గడ్డి వేసి వస్తానని వెళ్లిన ఓ బాలుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన గురువారం మండలంలోని చేగూరు రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తీగాపూర్‌కు చెందిన సరిత, బాలయ్య కుమారుడు సీ వేణు(17) పదో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం ఆవులకు గడ్డి వేయడానికి వేణు ఇంటి నుంచి పొలానికి వెళ్లాడు. రోడ్డుపై వెళుతున్న క్రమంలో బాలుడిని గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వేణు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధిలో కీలకం..
అవస్థలు అధికం



ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట వీఓఏల నిరసన

- వీఓఏల బతుకులు దుర్భరం
- వేతనాలు పెంచాలంటూ పోరుబాట
- 17 రోజులుగా సమ్మె..

అనంతగిరి: వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఐకేపీ–వీఓఏల యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్నారు. 17 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 645 మంది వీఓఏలు ఉన్నారు. సెర్ప్‌లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వీఓఏలు మహిళా సంఘాల బలోపేతంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. 2000 సంవత్సరంలో డ్వాక్రా అనంతరం ఐకేపీ, సెర్ప్‌గా మారింది. ఇటీవలే ప్రభుత్వం సెర్ప్‌లో పనిచేస్తున్న ఏపీఓ, సీసీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో పనిచేసే వీఓఏల సమస్యలను మాత్రం పట్టించుకోకపోవడంతో వారు సమ్మెలోకి వెళ్లారు.

డిమాండ్‌లు ఇవీ..

- కనీస వేతనం రూ.18వేలకు పెంచాలి
- వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి
- గుర్తింపు ఐడీ కార్డులు ఇవ్వాలి
- రూ.పది లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలి
- ఎస్‌హెచ్‌జీలకు పావలా వడ్డీ చెల్లించాలి
- అభయహస్తం డబ్బులు ఇవ్వాలి
- డ్రెస్ కోడ్ అమలు చేయాలి
- వ్యక్తిగత ఖాతాలోనే జీతం జమ చేయాలి

అరకొర వేతనమే..

రూ.3900 వేతనంతో విధులు నిర్వహిస్తున్నారు. వీఓఏలు ముఖ్యంగా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను మహిళా సంఘాల తరఫున ప్రజలకు అవగాహన కల్పించడం, సంఘాలకు రుణాలు ఇప్పించడం, రికవరీ చేయడం, సామాజిక కార్యక్రమాలపై అవగాహన వంటి పనులు చేపడుతున్నారు. విధుల్లో అనుసంధాన కర్తగా ఉంటూ మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నారు. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తుండటంతో బతుకులు దుర్భరంగా మారాయి. ప్రభుత్వ పథకాల విజయవంతంలో కీలకపాత్ర పోషిస్తున్న తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని వీఓఏలు కోరుతున్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. వేతనం రూ.18వేలకు పెంచాలి. మహిళా సంఘాల పనితీరులో క్షేత్రస్థాయిలో ఉంటూ అన్నింటినీ విజయవంతంగా కొనసాగిస్తున్నాం. మా సమస్యలను తక్షణం పరిష్కరించాలి.

– సుజాత, వీఓఏల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

వేతనాలు పెంచాలి



చాలీచాలని వేతనంతో జీవనం కొనసాగిస్తున్నాం. ఇదే ఉద్యోగాన్ని నమ్ముకుని ఏళ్లుగా పనిచేస్తున్నాం. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రతి నెలా వీఓఏల వ్యక్తిగత ఖాతాలోనే జీతం జమ చేయాలి.

– ప్రభు, వికారాబాద్ మండల అధ్యక్షుడు

బీఎస్పీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న నర్మద

కొడంగల్ : నియోజకవర్గంలో బహుజన సమాజ్‌వాది పార్టీని బలోపేతం చేయనున్నట్లు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద అన్నారు. గురువారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి మే 7న హైదరాబాద్‌కు వస్తున్నారని అన్నారు. మాయావతి పాల్గొనే సమావేశానికి నియోజకవర్గం నుంచి జన సమీకరణ చేయాలన్నారు. మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామం నుంచి బీఎస్పీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి బీఎస్పీ అభ్యర్థి పోటీలో ఉంటారని అన్నారు. బీఎస్పీ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుదాం’

కుల్కచర్ల: సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడం మనందరి బాధ్యత అని బీజేపీ నియోజకవర్గ నాయకులు, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం చౌడాపూర్ మండల పరిధిలోని మక్తవెంకటాపూర్‌లో నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.50వేలు విరాళం అందించారు. అనంతరం మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవడంతో పాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులతో శరత్ కుమార్ రెడ్డి తదితరులు

విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా..



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రమాదంలో స్థలంలో సుష్మ మృతదేహం

- ప్రమాదానికి గురైన కారు
- భార్య మృతి
- భర్త, కూతురుకు తీవ్రగాయాలు

పూడూరు: విహార యాత్రకు వెళ్లిన కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చన్గోముల్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దోమ మండలం దాదాపూర్‌కు చెందిన పూరి రమేశ్ (32), అతని భార్య సుష్మ(28), కూతురు ప్రణవి(10)తో కలిసి వారం రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి కారులో వస్తుండగా మండల పరిధిలోని సోమన్‌గుర్తి గేటు వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో సుష్మ అక్కడికక్కడే మృతి చెందగా భర్త రమేశ్, కూతురు ప్రణవికి తీవ్ర గాయాలయ్యాయి. అదే రాత్రి ఇరువురిని హైదరాబాద్ తరలించారు. మృతురాలి తల్లి శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చన్గోముల్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

న్యాయం చేయాలని వేడుకోలు



పరిగి: భర్త కోసం పిల్లలతో కలిసి భార్య నిరసనకు దిగిన ఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నరసింహారెడ్డికి కొల్లాపూర్‌కు చెందిన పద్మమ్మతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త, అత్త మామలు వేధింపులకు గురిచేస్తుండటంతో కొన్ని నెలల క్రితం పోలీసులను ఆశ్రయించింది. దీంతో నరసింహారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో గొడవలు అధికం కావడంతో పద్మమ్మ తమ పిల్లలను తీసుకుని తల్లిగారింటికి వెళ్లింది. ఈ క్రమంలో భర్త రెండో పెళ్లి చేసుకున్నాడు. తమకు న్యాయం చేయాలని పిల్లలతో వచ్చి భార్య ఇంటి ఎదుట బైఠాయించింది. రెండు రోజులుగా భర్త ఇంటి ఎదుట నిరసనకు దిగినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆమె వాపోయింది. న్యాయం జరిగే వరకు పోరాడుతానని తెలిపారు. పోలీసులు, గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

చెదలు.. నివారిస్తేనే లాభాలు

- రైతులకు అవగాహన తప్పనిసరి
- వ్యవసాయ అధికారుల నలహాలు, సూచనలు



చెట్టు మొదలుపై ఏర్పడిన చెదలు



మొక్కను పరిశీలిస్తున్న రైతు

బొంరాస్‌పేట : వ్యవసాయంలో తలెత్తే చెదలను పూర్తిగా తొలగిస్తేనే అధిక దిగుబడులు వచ్చి లాభాలు పొందవచ్చు. చెదల నివారణపై రైతులకు అవగాహన తప్పనిసరి. లేనట్టయితే సాగులోని పళ్ల తోటలు, పంటలు నష్టపోయే ప్రమాదం ఉంది. దీనిపై వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి. చెదలు మిగతా చీమలు, తేనెటీగల వలె సంఘజీవులు. చెదల సమూహాలు ఒక సంఘాలుగా ఉండి కొన్ని పురుగుల ఒక రకమైన పని, ఇతర పురుగులు వేరొక పనిని చేస్తాయి. చెద పురుగులలో రాణి, రాజు, శ్రమ, సైనిక చెద పురుగులు ఉంటాయి. రాణి పురుగు ప్రత్యుత్పత్తికి తోడ్పడుతుంది. కార్మిక జీవులు ఎక్కువ సంఖ్యలో ఉండి రాణి పురుగు పెట్టిన గుడ్లను, చిన్న పిల్ల పురుగులను కాపాడుతూ ఉంటాయి. ఇవి పంటలలో చాలా నష్టాన్ని కలిగించి మొక్కల వేరు, కాండం భాగాలను ఆశించి నష్టం కల్గిస్తాయి. ఇవి వ్యవసాయ పంటల్లో ముఖ్యంగా గోధుమ, వరి, చెరకు, కూరగాయలు, చిరుధాన్యాలు, పత్తి, వేరుశనగ, ఆముదం పంటల్లో మొక్కలను ఆశించి తీవ్ర నష్టాన్ని కలగజేస్తాయి. పండ్ల తోటలైన మామిడి, జామ, నిమ్మ, ద్రాక్ష, దానిమ్మ, సపోట, సీతాఫలం మొదలగు వాటిని ఆశించి నష్టాన్ని కల్గిస్తాయి. ఈ పండ్ల తోటల్లో ముఖ్యంగా నీటి పారుదల సరిగ్గాలేని తోటలలో చెదల సమస్య ఎక్కువగా ఉంటుంది. నాటిన తొలిదశలో ఆశించినట్లయితే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. తొలిదశలో నివారించకపోతే కొమ్మలు, చెట్లు ఎండిపోయి దిగుబడులు తగ్గుతాయి. ఇతర పంటలైన కొబ్బరి తదితర మొదలైన వాటిని కూడా ఇవి ఆశించి చాలా నష్టాన్ని కల్గిస్తాయి.

నివారణ ఇలా..

చెద పురుగులు మట్టితో కప్పబడి ఉంటాయి. వీటిని నివారించడం కష్టంతో కూడుకున్న పని. కింద తెలిపిన విధంగా చేసినట్లయితే కొంత వరకు చెద పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు.

- పొలాన్ని లోతుగా దున్నితే భూమిలోపల ఉండే చెద పురుగుల పుట్టలను, చెద పురుగులను నాశనం చేయవచ్చు.
- పంట పొలాల గట్లపైన లేక పొలంలో చుట్టూ ఉన్న చెద పురుగులను పూర్తిగా తవ్వి రాణి పురుగును వెలికి తీసివేయాలి.
- 5మి.లీ. క్లోరిపైరిఫాస్ 50ఇ.సి. మందును లీటరు నీటికి కలిపి సుమారు 15–30లీటర్ల మందు ద్రావణాన్ని చెద పుట్టలలో బాగా తడసేటట్లు పోయాలి.
- సరిగ్గా కుళ్లని సేంద్రియ పదార్థం చెద పురుగుల్ని ఆకర్షిస్తుంది. కనుక బాగా కుళ్లిన సేంద్రియ పదార్థాన్నే ఉపయోగించాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 6మి.లీ. క్లోరిపైరిఫాస్ మందును కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే చెద పురుగుల నుంచి కాపాడవచ్చు.
- చెరకు పంటలో చెదల నివారణకు 2మి.లీ.మలాథియాన్ మందును లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని 15 నిమిషాలు ఉంచి తర్వాత మొదల్లో వేయాలి.
- పండ్ల తోటల నారుమడులను తయారుచేసేటప్పుడు లిండేను, మిథైల్ పరాథియాన్ లాంటి పొడి మందును నారు మడుల్లో కలపాలి.
- పండ్ల మొక్కలు నాటే గుంతలలో మిథైల్ పారథియాన్ లేదా లిండే పొడి మందును 100గ్రాముల మోతాదులో కలిపి వేయాలి.
- పాలిథిన్ సంచులతో మొక్కలను పెంచేటప్పుడు లిండేను లేదా మిథైల్ పరాథియాన్ పొడి మందును ఒక కిలో ఒక ఘనపుటడుగు మట్టి మిశ్రమానికి కలిపి సంచులలో నింపి విత్తాలి.

ఉచిత బియ్యం కిలో రూ.20!

- సంతలో సరుకుగా మారిన రేషన్
- వినియోగదారులే విక్రయిస్తున్న వైనం
- కొనుగోలు చేస్తున్న కన్నడ పేదలు
- అరికట్టని రెవెన్యూ అధికారులు
- బషీరాబాద్‌లో జోరుగా విక్రయాలు



విక్రయానికి ఉంచిన రేషన్ బియ్యం

బషీరాబాద్: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం సంతలో సరుకుగా మారింది. సంతలో రూ.కిలో 20 చొప్పున అమ్ముడుపోతున్నాయి. బషీరాబాద్ మండల కేంద్రంలో జరిగే వారంతపు సంతలో కొందరు వ్యాపారస్తులు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వినియోగదారులకు ఒక్కో వ్యక్తికి ప్రభుత్వం ఉచితంగానే పదికిలోల చొప్పున బియ్యం అందిస్తోంది. అయితే పేదలు తప్ప చాలా మంది రేషన్ బియ్యం తినడంలేదు. చాలా మంది తమకు ఉచితంగా వచ్చే బియ్యాన్ని బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారు. మరి కొందరు రేషన్ డీలర్లకే అప్పగించి వారి నుంచి కిలోకు పదిరూపాయల చొప్పున తీసుకుంటున్నారు. అయితే రేషన్ కార్డు లేని పేద ప్రజలు, కూలీలు వారం వారం సంతకు వచ్చి కిలో 20 రూపాయల చొప్పున అవే బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటం గమనార్హం. ముఖ్యంగా పొరుగు రాష్ట్రం కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి వచ్చే పేదలు ఈ బియ్యాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇది ప్రతీ మంగళవారం సంతలో యథేచ్ఛగా జరుగుతున్నా అరికట్టాల్సిన రెవెన్యూ యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సాగురైతులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న రైతులు, సంఘాల నాయకులు

బొంరాస్‌పేట: ఏళ్లతరబడి సాగులో ఉంటూ పంటలు పండిస్తూ రైతులుగా ఉంటున్న తమకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మండల పరిధిలోని బొంరాస్‌పేట, కొత్తూరు, బురాన్‌పూర్, మదన్‌పల్లి రైతులకు దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నా అధికారులు స్పందించడం లేదని అన్నారు. పట్టాలు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. ఈనెల 29న తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటలకు ధర్నా చేపట్టనున్నట్లు కేవీపీఎస్ నాయకులు లక్ష్మయ్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాటసమితి నాయకులు చిన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు లక్ష్మణ్, రమేశ్, నర్సయ్య, ఆనందం, సురేశ్, బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన బైక్

ఒకరి దుర్మరణం

కొడంగల్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. మండల పరిధిలోని ప్యాలమద్ది గేటు శివారులో ఆగిఉన్న సిమెంట్ లారీను బైక్ ఢీకొట్టగా బైక్ నడుపుతున్న కందనెల్లి గ్రామానికి చెందిన పరశురాం అక్కడిక్కడే మృతిచెందినట్లు సమాచారం. ప్రమాద విషయమై కొడంగల్ ఎస్‌ఐ రవిగౌడ్‌ను సంప్రదించగా మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియదని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: పేదల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహించరాదని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. గురువారం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం పీహెచ్‌సీలకు సరిపడా మందులు సరఫరా చేస్తోందన్నారు. వాటిని ఎప్పటికప్పుడు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు అందజేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి బీపీ, షుగర్ ఉన్న వారిని గుర్తించి వారికి మందులను అందజేయాలన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రతిరోజూ చాలా మంది చికిత్స నిమిత్తం వస్తుంటారని, వారికి నర్సులు బీపీ, షుగర్ పరీక్షలను చేయాలని సూచించారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షికి నివాళులర్పిస్తున్న నాయకులు

వికారాబాద్ అర్బన్: కఠోరమైన దీక్షకు, పట్టుదలకు నిదర్శనం భగీరథ మహర్షి అని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గంగను భూమిపైకి తీసుకువచ్చేందుకు కఠోర దీక్ష చేసిన మహా పురుషుడని కొనియాడారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరున మిషన్ భగీరథ పథకం అమలు చేయడం అభినందనీయమన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో చారిత్రక కట్టడాల్లో సగరులు ముఖ్యపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతులు అభివృద్ధి అధికారి ఉపేందర్, ఎంపీపీ చంద్రకళ, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి రవి, కార్యదర్శి కృష్ణయ్య, మహాత్ముల ఉత్సవాల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంగీతపు రాజలింగం, జగదీశ్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం మల్లికార్జునుడి కల్యాణోత్సవం

చంద్రధనలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవ వేడుకలో పాల్గొన్న నిర్వాహకులు, సర్పంచ్, భక్తులు

తలకొండపల్లి: మండలంలోని చంద్రధన గ్రామంలో వెలసిన మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం గురువారం నేత్రపర్వంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున వేద పండితులు విఠల్ జీ, శివానంద్‌లు మంత్రోచ్చారణల మధ్య ముత్యాల తలంబ్రాలతో పార్వతీదేవి సమేత మల్లికార్జునస్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. అంతకుముందు మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పాట్లేళ్ల ఎడ్ల బండిపై ప్రతిష్ఠించి బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. కల్యాణోత్సవ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సర్పంచ్ కుమార్ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాత గురువులు కే మల్లయ్య, వార్డు సభ్యులు రాణి, రాజు, వెంకటేశు, రేణుక, యాదయ్య, కృష్ణవేణి, యాదగిరి, సునీత, ప్రసాద్, భగవంతు, రవీందర్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.